


# BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్




సంపుటి - 01 సంచిక -69 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 17-03-2026 మంగళవారం పేజీలు : 6

## తెలంగాణ సాహిత్య శిఖరం 'నందిని'కి
## కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

- 'అనిమేష' కవితా సంపుటికి ప్రతిష్ఠాత్మక అవార్డు ప్రకటన
- అక్షర యోధుడికి అభినందనల వెల్లువ.. కేసీఆర్, కేటీఆర్ హర్షం
- "కరోనా విషాదాన్ని, మానవ సంబంధాలను అద్భుతంగా ఆవిష్కరించారు" - ప్రముఖుల ప్రశంస


2 లో

హైదరాబాద్, మార్చి 16 (బిఎన్ఎస్): తెలంగాణ మట్టి వాసనను, ఉద్యమ ఉద్ధృతిని తన కలంతో ప్రపంచానికి పరిచయం చేసిన అక్షర యోధుడు, ప్రముఖ కవి డాక్టర్ నందిని సిద్ధారెడ్డికి 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది .

## ఆవిష్కరణల్లో అగ్రగామిగా
# తెలంగాణ

> "సమగ్ర, సమతుల్య అభివృద్ధితో తెలంగాణను ప్రపంచ స్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. 'తెలంగాణ రైజింగ్--2047' విజన్‌తో రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా పలు సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు."

- బలహీన వర్గాలకు భరోసా -- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- 'తెలంగాణ రైజింగ్--2047'తో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం
- ఆవిష్కరణలు, సంక్షేమంతో తెలంగాణ ముందంజ: గవర్నర్
- భవిష్యత్తు నగరంగా హైదరాబాద్: మూసీ రివర్ ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు
- సమతుల్య అభివృద్ధి లక్ష్యంగా వికేంద్రీకృత వ్యూహం: గవర్నర్ ప్రసంగం
- ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణ నిర్మాణం: గవర్నర్


2 లో

తెలంగాణ సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి ఐకమత్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని గవర్నర్ గారు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, ఆశయాలు, భవిష్యత్తు లక్ష్యాలను సవివరంగా సభ ముందు ఆవిష్కరించారు. ఆవిష్కరణల్లో అగ్రగామిగా, బలహీన వర్గాలకు భరోసాగా, ప్రపంచానికి ఆదర్శంగా తెలంగాణను నిర్మించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

బడ్జెట్ సమావేశాలకు హాజరైన సభ్యులందరికీ గవర్నర్ హృదయపూర్వక స్వాగతం పలుకుతూ... "ప్రపంచంలోనే గుర్తింపు పొందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ముందుకు సాగుతున్నాం. అందుకోసం బలమైన పునాదులు వేసేందుకు ఏడాది కాలంలో ఎన్నో సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది.

సమున్నతమైన ఆశయంతో 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి గడిచిన రెండేండ్లుగా ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరిచి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు రైతు సంక్షేమ పథకాలు అమలు చేసింది.

## పశ్చిమాసియాలో ముదురుతున్న
# రణరంగం

- ఇరాన్‌పై ఇజ్రాయెల్ 'వేల లక్ష్యాల' వేట!
- సోమవారం తెల్లవారుజాము నుంచే భీకర దాడులు.. ఇరాన్ క్షిపణి కేంద్రాలే టార్గెట్
- ఇజ్రాయెల్‌పై ఇరాన్ 4 విడతల క్షిపణి వర్షం.. దుబాయ్ ఎయిర్‌పోర్ట్ తాత్కాలిక మూసివేత
- "యుద్ధం ఎక్కడికైనా వెళ్తుంది.. మేం సిద్ధం" - ఇరాన్ విదేశాంగ మంత్రి హెచ్చరిక


2 లో

టెల్ అవీవ్/టెహ్రాన్, మార్చి 16: పశ్చిమాసియాలో యుద్ధం మూడో వారంలోకి ప్రవేశించగా, సోమవారం నాటి పరిణామాలు ప్రపంచాన్ని మరింత ఆందోళనలోకి నెట్టాయి. ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలు, క్షిపణి తయారీ కేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (IDF) సోమవారం తెల్లవారుజాము నుంచి 'వేల లక్ష్యాలపై' విరుచుకుపడుతోంది.

## ఎన్నికల సమరానికి
# సిద్ధం కావాలి

- శ్రేణులకు సజ్జల పిలుపు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల పరిశీలకుల సమీక్షా సమావేశం


2 లో

## అమరజీవి త్యాగం..
# తెలుగు జాతికి నిత్య ప్రేరణ

-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

- "రైతుల త్యాగానికి ప్రతిరూపం అమరావతి..
- అమరజీవి స్ఫూర్తితో రాజధాని పునర్నిర్మాణం"


2 లో

## కృష్ణా, గోదావరి జలాల్లో
# తీవ్ర అన్యాయం

- కాంగ్రెస్ సర్కార్ చోద్యం చూస్తుంది

\- మాజీ మంత్రి హరీష్‌రావు



కృష్ణా, గోదావరి నదుల జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు.అసెంబ్లీలోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. తెలంగాణ హక్కులను రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన పేర్కొన్నారు.

గోదావరి, బనకచర్ల అంశాలపై ఢిల్లీలో జరిగిన సమావేశానికి సంబంధించిన మినిట్స్ విడుదలై నెల రోజులు గడిచినా, తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ముఖ్యమంత్రి స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం నిద్రలేచి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

లేఖల ద్వారా మాత్రమే స్పందించడం కాకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం--నల్లమలసాగర్ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం కూడా తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని ఆయన అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణ హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## ఈ నెల 30 వరకు
# అసెంబ్లీ సమావేశాలు..

● 20న బడ్జెట్..


2 లో

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నిర్వహణపై అసెంబ్లీ స్పీకర్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం, బడ్జెట్ సమావేశాలను ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజా సమస్యలు , కొత్త బడ్జెట్ ప్రతిపాదనలపై ఈ సమావేశాల్లో సుదీర్ఘంగా చర్చించనున్నారు.

## ముస్లింల ఆర్థిక, రాజకీయ
# పురోగతే లక్ష్యం

: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


2 లో

విజయవాడ, మార్చి 16 (బిఎన్ఎస్): "పేదలకు సాయం చేయడమే ఖురాన్ ప్రవచించిన పరమార్థం. ముస్లిం సోదరులను ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం" అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సోమవారం విజయవాడలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

# ఈస్ట్-వెస్ట్ కార్గో కారిడార్‌గా ఏపీ


2 లో

అమరావతి, మార్చి 16(బిఎన్ఎస్): రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్ల ద్వారా ఈస్ట్ -వెస్ట్ కార్గో కారిడార్గా ఏపీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితం అవుతున్న మూలపేట, మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల్లో త్వరితగతిన కార్గో హ్యాండ్లింగ్ ఆపరేషన్లు ప్రారంభం కావాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



# ఆవిష్కరణల్లో అగ్రగామిగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమగ్ర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా అంచెలంచెలుగా వికేంద్రీకృత వ్యూహాన్ని అనుసరించింది. వేగంగా పట్టణీకరణ చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడానికి, ప్రజా సమస్యల పరిష్కారం, పౌర సేవలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టింది.

దీనికి తోడుగా కోర్ అర్బన్ రీజియన్‌లో హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని పునర్వ్యవస్థీకరించాం. అలాగే కోర్ అర్బన్ ప్రాంతంలో సరస్సులు, చెరువులు, ట్యాంకులను పునరుద్ధరించడానికి ప్రజా ప్రభుత్వం నడుం బిగించింది. హైడ్రా ఏర్పాటు ద్వారా దాదాపు 60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా ఆక్రమణలు, కబ్జాలకు గురైన ప్రాంతాలను స్వాధీనం చేసుకుంది.

ఆధునాతన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో 55 కి.మీ. మేరకు మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టును చేపట్టింది. ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన ఉన్న ప్రాంతంలో (పెరి-అర్బన్ రీజియన్) మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఎకో-ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్ కంపెనీలతో మౌలిక సదుపాయాల హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించాం.

ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ అత్యంత కీలక గమ్యస్థానంగా నిలిచింది. ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా సమ్మిట్ నిర్వహించడమే కాకుండా పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు వివిధ రంగాల్లోని ప్రముఖులతో 5.75 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను సాధించింది. ఎగుమతుల్లో దేశంలోనే 7వ స్థానంలో తెలంగాణ నిలిచింది.

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, నెట్ జీరో ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య అనుసంధానంగా రేడియల్ రోడ్లు, శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా, భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం, హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై, పూణె నగరాలకు హైస్పీడ్ బుల్లెట్ రైళ్లతో రాష్ట్రం ఆర్థిక వృద్ధి సాధిస్తుంది. తెలంగాణ పురోభివృద్ధికి 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ కోసం దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్ రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇంధన రంగంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 23,187 మెగావాట్లకు పెరిగింది. ఇందులో 44.55 శాతం పునరుత్పాదక వనరుల నుంచి రావడం ప్రశంసనీయం.

# పశ్చిమాసియాలో ముదురుతున్న రణరంగం

మొదటి పేజీ తరువాయి

మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గకుండా ఇజ్రాయెల్‌పై నాలుగు దఫాలుగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి తన పంతాన్ని చాటుకుంది.

ఇజ్రాయెల్ తదుపరి మూడు వారాల వ్యూహం:

సోమవారం ఉదయం IDF ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ ఎఫీ డెఫ్రిన్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ రక్షణ రంగంపై దాడులను మరింత తీవ్రతరం చేస్తామని, తమ వద్ద ఇంకా వేల సంఖ్యలో లక్ష్యాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇప్పటికే టెహ్రాన్, షిరాజ్, తబ్రిజ్ వంటి ప్రధాన నగరాల్లోని క్షిపణి గిడ్డంగులను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఇరాన్ యొక్క వ్యూహాత్మక ముప్పును శాశ్వతంగా తొలగించేందుకు మరో మూడు వారాల పాటు ఈ ఆపరేషన్ కొనసాగే అవకాశం ఉందని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

ఇరాన్ ఎదురుదాడి – గల్ఫ్ దేశాల్లో టెన్షన్:

ఇజ్రాయెల్ దాడులకు ప్రతిచర్యగా ఇరాన్ సోమవారం క్షిపణి దాడులను ఉధృతం చేసింది. రిషాన్ లెజియాన్ సమీపంలో ఒక ఇల్లు ధ్వంసం కాగా, క్లస్టర్ బాంబుల దాడిలో ఒకరు గాయపడినట్లు సమాచారం. ఈ క్రమంలోనే దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ల సంచారం మరియు ఇంధన ట్యాంకర్ల వద్ద మంటలు చెలరేగడంతో విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. సౌదీ అరేబియా కూడా తమ దేశం వైపు దూసుకొచ్చిన 61 డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది.

చర్చలకు తావులేదు – ఇరాన్ కౌంటర్:

“మేము సంధిని కోరడం లేదు.. ఇజ్రాయెల్ మరియు అమెరికాతో యుద్ధం ఎంతవరకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం” అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చీ సోమవారం విలేకరుల సమావేశంలో ఘాటుగా వ్యాఖ్యానించారు. శత్రువులకు హోర్ముజ్ జలసంధి మూసివేస్తామని హెచ్చరిస్తూనే, తమ గడ్డపై దాడులు ఆగే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు.

అమెరికా మద్దతు – గ్లోబల్ ఎఫెక్ట్:

ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు పూర్తి అండగా నిలుస్తోంది. హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు నాటో దేశాల సహకారాన్ని అమెరికా కోరుతోంది. ఒకవేళ మిత్రదేశాలు సహకరించకపోతే నాటో భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ట్రంప్ హెచ్చరించారు. మరోవైపు, ఈ ఉద్రిక్తతల మధ్యే భారత గ్యాస్ నౌక ‘శివాలిక్’ సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకోవడం భారత్‌కు ఊరటనిచ్చే అంశం.

మొత్తానికి, ఇరాన్ యొక్క క్షిపణి తయారీ సామర్థ్యాన్ని పూర్తిగా దెబ్బతీసే వరకు ఇజ్రాయెల్ తగ్గేలా కనిపించడం లేదు. అగ్రరాజ్యం అమెరికా నేరుగా రంగంలోకి దిగడంతో ఈ యుద్ధం ఏ మలుపు తిరుగుతుందోనని ప్రపంచం ఉత్కంఠగా గమనిస్తోంది.

# అమరజీవి త్యాగం.. తెలుగు జాతికి నిత్య ప్రేరణ



అమరావతి, మార్చి 16 (బిఎన్‌ఎస్): తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. సోమవారం అమరావతిలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 58 అడుగుల భారీ విగ్రహాన్ని (స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్) ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపాలా శాఖ రూపొందించిన ప్రత్యేక పోస్టల్ కవర్‌ను కూడా నేతలు విడుదల చేశారు.

త్యాగానికి నిలువెత్తు రూపం: 58 అడుగుల విగ్రహం

సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు గారు చేసిన 58 రోజుల నిరాహార దీక్షకు గుర్తుగా ఈ 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. “ప్రపంచంలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఉంది, మన దేశంలో స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉంది.. ఇప్పుడు మన ఆంధ్రప్రదేశ్‌లో త్యాగానికి ప్రతీకగా ‘స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్’ ఉంది” అని ఆయన ప్రకటించారు. కేవలం ఆరు నెలల రికార్డు కాలంలోనే మెమోరియల్ పార్క్ మొదటి దశను పూర్తి చేయడం గర్వకారణమని పేర్కొన్నారు.

కులాలకు అతీతమైన మహోన్నత వ్యక్తి

పొట్టి శ్రీరాములు ఏ ఒక్క కులానికో, వర్గానికో చెందిన వ్యక్తి కాదని, ఆయన తెలుగు వారందరివాడని సీఎం స్పష్టం చేశారు. గాంధీజీ అహింసా సిద్ధాంతంతో స్వాతంత్ర్యం తెస్తే, శ్రీరాములు గారు ఆత్మార్పణతో మనకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టారని గుర్తు చేశారు. దళితుల ఆలయ ప్రవేశం కోసం 29 రోజులు, స్వరాష్ట్రం కోసం నీళ్లు కూడా తాగకుండా 58 రోజులు ఆయన చేసిన పోరాటం ప్రతి తెలుగువాడు తెలుసుకోవాలన్నారు. భార్యాపిల్లలు చనిపోయినా ఆ బాధను దిగమింగి దేశం కోసం పోరాడిన ధీశాలి అని కొనియాడారు.

రాజధానిపై గత పాలకుల ‘మూడు ముక్కలాట’

ఈ సందర్భంగా గత ప్రభుత్వ తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. “గత ఐదేళ్లలో (2019-24) రాజధానిని మూడు ముక్కలాటగా మార్చారు. మూడు రాజధానుల పేరుతో అసలు రాజధానే లేని పరిస్థితి తెచ్చారు. అమరావతిని శ్మశానం అని, ఎడారి అని అవమానించారు” అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని ఆనాడు కొందరు గుర్తించని విధంగానే, అమరావతి రైతుల త్యాగాన్ని కూడా గత పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు.

ప్రజా రాజధానిగా అమరావతి పునర్వైభవం

తెలుగు జాతి గతంలోనూ, ఇప్పుడూ అనేక సమస్యలను ఎదుర్కొంటోందని, కానీ ఇప్పుడు అమరావతి ‘ప్రజా రాజధాని’గా వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. కర్నూలు, హైదరాబాద్ మీదుగా సాగిన తెలుగు వారి ప్రయాణం ఇప్పుడు అమరావతి వద్ద సుస్థిరమవుతోందన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలకు నాంది పలికిన అమరజీవి ఆశయాల సాధన కోసం, నవ్యాంధ్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని అమరజీవికి ఘనంగా నివాళులర్పించారు.

# ముస్లింల ఆర్థిక, రాజకీయ పురోగతే లక్ష్యం



మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రికార్డు స్థాయి పథకాలను వివరించారు.

అంకెల్లో మైనారిటీ సంక్షేమం:

ముస్లింల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేస్తున్న ఖర్చును సీఎం వివరంగా పేర్కొన్నారు.

పింఛన్లు: 4.38 లక్షల మంది ముస్లింలకు ‘ఎన్టీఆర్ భరోసా’ కింద ఏడాదికి రూ.3,511 కోట్లు అందిస్తున్నాం.

విద్య: 4.5 లక్షల మంది విద్యార్థులకు ‘తల్లికి వందనం’ పథకం వర్తింపజేస్తున్నాం. 19,215 మందికి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.240 కోట్లు కేటాయించాం.

దీపం పథకం: 6.20 లక్షల కుటుంబాలకు రూ.158 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

ఇమామ్‌లకు తీపి కబురు.. వక్ఫ్ ఆస్తుల రక్షణ:

గత పాలకులు నిలిపివేసిన ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనాలకు సంబంధించి రూ.45 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. అర్హులైన ఇమామ్‌లను ప్రభుత్వ ఖాజీలుగా నియమించడంతో పాటు, వివాహ లైసెన్స్ గడువును 3 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. వక్ఫ్ బోర్డును వివాదాల్లోకి నెట్టిన గత ప్రభుత్వ జీవో 47ను రద్దు చేశామని, 1500 వక్ఫ్ ఆస్తుల సర్వే పూర్తి చేసి వాటిని కాపాడుతామని భరోసా ఇచ్చారు.

బడ్జెట్‌లో పెద్దపీట:

గత బడ్జెట్‌లో మైనారిటీలకు రూ.5,434 కోట్లు కేటాయిస్తే, ఈసారి ఆ మొత్తాన్ని రూ.6,090 కోట్లకు పెంచినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఉర్దూ అకాడమీకి గత ప్రభుత్వం కేవలం రూ.1 లక్ష ఇస్తే, తమ ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఉర్దూను రాష్ట్ర రెండో అధికార భాషగా ప్రకటించామని, కడప మరియు విజయవాడ హజ్ హౌస్‌లను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.


నూతన సంస్కరణలు:

నూర్ బాషా ఫెడరేషన్‌ను ‘దూదేకుల ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్’గా మారుస్తూ రూ.100 కోట్లు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు. అలాగే అబ్దుల్ హక్ అవార్డు నగదును రూ.1.25 లక్షలకు పెంచామని, ఉర్దూ ఘర్, షాదీఖానాల కోసం రూ.2.85 కోట్లు కేటాయించామని తెలిపారు. రంజాన్ పండుగను పేదలు సంతోషంగా జరుపుకోవాలన్న మహ్మద్ ప్రవక్త బోధనలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తి అని చంద్రబాబు నాయుడు తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ విందులో మంత్రులు, మత పెద్దలు మరియు భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొని ముక్తకంఠంతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ సాహిత్య శిఖరం ‘నందిని’కి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

మొదటి పేజీ తరువాయి



సోమవారం ఢిల్లీలో జరిగిన అకాడమీ సమావేశంలో 24 భాషలకు సంబంధించి వార్షిక పురస్కారాలను ప్రకటించగా, తెలుగు విభాగంలో సిద్ధారెడ్డి రచించిన ‘అనిమేష’ కవితా సంపుటిని ఈ గౌరవం వరించింది. ఈ పురస్కారం కింద రూ. 1 లక్ష నగదు, తామ్రపత్రం, శాలువాతో ఆయనను సత్కరించనున్నారు.

కరోనా కాలానికి అక్షర దర్పణం – ‘అనిమేష’

విశ్వాన్ని వణికించిన కరోనా మహమ్మారి సమయంలో మానవ సంబంధాల విచ్ఛిన్నతను, సామాజిక సంక్షోభాన్ని, వలస కూలీల కష్టాలను అత్యంత హృద్యంగా ఈ ‘అనిమేష’ (దీర్ఘకవిత)లో సిద్ధారెడ్డి చిత్రించారు. కేవలం అక్షరాల కూర్పుగా కాకుండా, ఒక కాలానికి దర్పణంగా నిలిచిన ఈ రచనకు జాతీయ గుర్తింపు లభించడం పట్ల సాహితీ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

అభినందనల వెల్లువ:

నందిని సిద్ధారెడ్డికి అవార్డు దక్కడంపై రాజకీయ, సాహిత్య రంగాల ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్: “నా మిత్రుడు సిద్ధారెడ్డికి ఈ పురస్కారం లభించడం తెలంగాణ సాహిత్యానికి గర్వకారణం. తెలంగాణ అస్తిత్వాన్ని తన కవిత్వం ద్వారా చాటిన ఉద్యమ కవి ఆయన” అని మాజీ సీఎం కేసీఆర్ కొనియాడారు.

కేటీఆర్ & హరీశ్ రావు: తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఈ అవార్డు సముచితమైన గౌరవమని కేటీఆర్, హరీశ్ రావు ప్రశంసించారు.

ఉద్యమ పాటల స్వరకర్త:

సిద్దిపేట జిల్లా బందారం గ్రామానికి చెందిన సిద్ధారెడ్డి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ప్రజలను ఉర్రూతలూగించారు. ‘నాగేటి సాల్లల్ల నా తెలంగాణ’ వంటి చిరస్మరణీయ గీతాలు ఆయన కలం నుంచి వచ్చినవే. మంజీరా రచయితల సంఘం (మరసం) ద్వారా ఎందరో కవులను ప్రోత్సహించిన ఆయన, ఇప్పుడు జాతీయ స్థాయిలో తెలుగు సాహిత్య జెండాను ఎగురవేశారు.

ఈ అవార్డు ప్రదానోత్సవం మార్చి 31, 2026న న్యూఢిల్లీలో జరగనుంది. తెలంగాణ అస్తిత్వానికి, భాషకు ప్రాణం పోసిన సిద్ధారెడ్డికి ఈ పురస్కారం లభించడంతో రాష్ట్రవ్యాప్తంగా సాహితీ ఉత్సవ వాతావరణం నెలకొంది.

# ఈస్ట్-వెస్ట్ కార్గో కారిడార్‌గా ఏపీ

మొదటి పేజీ తరువాయి



ఈ మూడు పోర్టుల నుంచి పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌ఘఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణా, కర్ణాటకల హింటర్ ల్యాండ్ నుంచి కార్గో రవాణా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టులు 2026 డిసెంబరు నాటికి పూర్తి అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ కూడా ఏర్పాటైన అనంతరం కంటైనర్, బల్క్ కార్గో పోర్టుగా రామాయపట్నం మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రామాయపట్నం నుంచి కడప స్టీల్ ప్లాంట్ వరకూ ప్రత్యేక మార్గాన్ని వేసేందుకు కూడా రైల్వే శాఖ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. మూడు పోర్టులకు సమీపంలోనూ పోర్టు టౌన్ షిప్ ఏర్పాటు చేయడం ద్వారా వాణిజ్య పరమైన లావాదేవీలు కూడా పెరుగుతాయని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు పోర్టులకు సమీపంలో పారిశ్రామిక కారిడార్‌లు కూడా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉందన్నారు. రెండో దశలో బుడిగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం ఫిషింగ్ హార్బర్లను కూడా వేగంగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. సమీప భవిష్యత్తులో ప్రతీ 50 కిలోమీటర్లకు పోర్టు, ఫిషింగ్ హార్బర్లు రానున్న నేపథ్యంలో ఈస్ట్ కోస్టు లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ మారుతుందన్నారు. ఏపీలో ఉన్న పోర్టులు కార్గో హ్యాండ్లింగ్‌లో గేమ్ ఛేంజర్‌గా మారాలని సీఎం సూచనలు చేశారు. ప్రస్తుతం యుద్ధం కారణంగా దుబాయ్, గల్ఫ్ దేశాల్లోని ఓడరేవులు ఇబ్బందుల్లో పడ్డాయని.. ఇప్పుడు భారత్ లోని ఈస్ట్ కోస్ట్ లో ఉన్న పోర్టులే సురక్షితం అన్న అభిప్రాయం వచ్చిందని ఈ ప్రయోజనాన్ని అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, మారి టైమ్ బోర్డు సీఈఓ అభిషేక్ కుమార్ హాజరయ్యారు.

# ఎన్నికల సమరానికి సిద్ధం కావాలి



అమరావతి(బిఎన్‌ఎస్): రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు మరియు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమరశంఖం పూరించింది. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకులతో పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, బూత్ స్థాయి కమిటీల పనితీరుపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు.

ప్రతి ఇంటికీ వైఎస్సార్‌సీపీ సందేశం:

సమావేశంలో సజ్జల మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత పరిశీలకులదేనని స్పష్టం చేశారు. “మనం చేసిన మేలు ప్రతి గడపకూ తెలుసు, కానీ దానిని రాజకీయంగా మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి” అని ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

సమన్వయమే సక్సెస్ మంత్రం:

నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు మరియు స్థానిక నాయకుల మధ్య పూర్తిస్థాయి సమన్వయం ఉండేలా చూడాలని పరిశీలకులకు సూచించారు. ఎక్కడైనా చిన్నపాటి అసంతృప్తులు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించి, అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడమే పరిశీలకుల ప్రధాన కర్తవ్యమని గుర్తు చేశారు.

కార్యకర్తలకు అండగా ఉండాలి:

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపునివ్వాలని, వారి సమస్యలను పరిష్కరించడంలో అండగా నిలవాలని సజ్జల ఆదేశించారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని, సోషల్ మీడియా వేదికగా పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించాలని సూచించారు.

వ్యూహాత్మక అడుగులు:

ఈ సమీక్షా సమావేశంలో క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నివేదికలను సజ్జల పరిశీలించారు. ఏ నియోజకవర్గంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు త్వరలోనే మరిన్ని కీలక నిర్ణయాలు ఉంటాయని, అందరూ ఎన్నికల మూడ్‌లోకి రావాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో పార్టీ కీలక నేతలు, వివిధ జిల్లాల పరిశీలకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ నెల 30 వరకు అసెంబ్లీ సమావేశాలు.. 20న బడ్జెట్..



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నిర్వహణపై అసెంబ్లీ స్పీకర్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం, బడ్జెట్ సమావేశాలను ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజా సమస్యలు , కొత్త బడ్జెట్ ప్రతిపాదనలపై ఈ సమావేశాల్లో సుదీర్ఘంగా చర్చించనున్నారు. ప్రభుత్వం ఈ నెల 20వ తేదీన అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ఇతర సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది.

సమావేశాల మధ్యలో ఉగాది, రంజాన్ , శ్రీరామనవమి వంటి ప్రధాన పండుగలు వస్తుండటంతో ఆయా రోజుల్లో సభకు సెలవులు ప్రకటించారు. ఈ సెలవుల కారణంగా పనిదినాలు తగ్గకుండా ఉండేందుకు, ప్రభుత్వం ఈ నెల 29వ తేదీ ఆదివారం నాడు కూడా సభను నిర్వహించాలని యోచిస్తోంది. ప్రభుత్వ అజెండాతో పాటు ప్రజా సమస్యలపై చర్చించేందుకు తగిన సమయం ఇవ్వాలని ప్రతిపక్షాలు కోరుతుండగా, సభను అర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం మీద మార్చి 30 వరకు జరగనున్న ఈ సమావేశాలు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.ం

# కొల్లూరు భూముల వ్యవహారం

## ప్లాట్ యజమానుల ఐక్యతతో న్యాయ హక్కుల సాధనకు కొత్త దిశ

కొల్లూరు భూముల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. చాలా కాలంగా కొనసాగుతున్న ఈ వివాదంలో ఇప్పుడు ప్లాట్ యజమానులు ఐక్యంగా ముందుకు రావడం కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఇటీవల జరిగిన సమావేశంలో కొత్త ప్లాట్ యజమానులు సమిష్టిగా సమావేశమై తమ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. న్యాయబద్ధమైన హక్కులను సాధించుకోవడానికి ఇకపై ఒక్కటిగా పోరాటం కొనసాగించాలని వారు నిర్ణయించారు. ముఖ్యంగా మెసారా ఇన్‌ఫ్రా గ్రూప్‌తో కలిసి ముందుకు సాగాలని ఏకగ్రీవంగా తీర్మానించడం ఈ సమావేశంలో ప్రధానంగా వెలువడిన అంశంగా నిలిచింది.

1984లో ప్లాట్లుగా విభజన

కొల్లూరు ప్రాంతంలోని ఈ భూముల చరిత్రను పరిశీలిస్తే, 1984 సంవత్సరంలో ఈ భూములను చట్టబద్ధంగా ప్లాట్లుగా విభజించినట్లు ప్లాట్ యజమానులు చెబుతున్నారు. అప్పటి నిబంధనలకు అనుగుణంగా భూములను చిన్న చిన్న ప్లాట్లుగా విభజించి కొనుగోలు, విక్రయాలు జరిగాయి. అనేక కుటుంబాలు తమ జీవిత పొదుపులతో ఈ ప్లాట్లను కొనుగోలు చేసాయి. కొందరు అక్కడ నివాసాల నిర్మాణం చేయాలని భావించగా, మరికొందరు భవిష్యత్ అవసరాల కోసం పెట్టుబడిగా ఈ స్థలాలను తీసుకున్నారు.

ఈ లావాదేవీలు చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ల ద్వారా జరిగాయని ప్లాట్ యజమానులు చెబుతున్నారు. అప్పటి నుంచి పలుమార్లు ఈ ప్లాట్లు చేతులు మారినా కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియల ద్వారా చట్టబద్ధంగా కొనుగోళ్లు కొనసాగినట్లు వారు పేర్కొంటున్నారు. అంటే మొదటి విభజన నుంచే ఈ భూములపై జరిగిన లావాదేవీలు చట్టబద్ధమైనవే అన్నది వారి వాదన.

2002లో అవుటర్ రింగ్ రోడ్ ప్రతిపాదన -- పరిస్థితుల మార్పు

2002 ప్రాంతంలో అవుటర్ రింగ్ రోడ్ ప్రతిపాదన వెలువడిన తరువాత ఈ ప్రాంతానికి అకస్మాత్తుగా ప్రాధాన్యం పెరిగింది. భవిష్యత్‌లో నగర అభివృద్ధికి కీలకంగా మారే ప్రాంతంగా కొల్లూరు గుర్తింపు పొందింది. దీంతో పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ ఆసక్తులు పెరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఈ పరిణామాల తరువాత కొంతమంది ప్రభావశీలులు రంగప్రవేశం చేసినట్లు ఆరోపణలు వినిపించాయి. ఇప్పటికే ప్లాట్లుగా విభజించి విక్రయించిన భూములను తిరిగి ఎకరాలుగా చూపిస్తూ కొత్త లావాదేవీలు జరిపినట్లు ప్లాట్ యజమానులు ఆరోపిస్తున్నారు. చిన్న చిన్న ప్లాట్లుగా ఉన్న భూములను మొత్తం భూభాగంగా చూపిస్తూ ఎకరాల లెక్కలో లావాదేవీలు జరిగాయని వారు చెబుతున్నారు.

దీంతో అసలు ప్లాట్ యజమానుల హక్కులు ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితి ఏర్పడింది. చాలామంది ప్లాట్ యజమానులు తమ హక్కులను రుజువు చేసుకోవడానికి న్యాయపోరాటం ప్రారంభించారు.

లోకాయుక్త తీర్పు -- ప్లాట్ యజమానులకు బలం

ఈ వ్యవహారం వివిధ స్థాయిల్లో విచారణకు వెళ్లిన తర్వాత లోకాయుక్త దృష్టికి కూడా వెళ్లింది. విచారణ అనంతరం వచ్చిన తీర్పులో ప్లాట్ యజమానుల వాదనకు చట్టబద్ధత ఉందని పేర్కొన్నట్లు వారు చెబుతున్నారు. 1984లో జరిగిన ప్లాట్ల విభజన మరియు ఆ తరువాత జరిగిన చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ లావాదేవీలను గుర్తించాలని సూచనలు వెలువడినట్లు ప్లాట్ యజమానుల వర్గాలు చెబుతున్నాయి.




ఈ తీర్పు ప్లాట్ యజమానులకు పెద్ద ఊరట కలిగించిన అంశంగా భావిస్తున్నారు. తమ హక్కులు చట్టబద్ధమైనవే అన్న నమ్మకం మరింత బలపడిందని వారు పేర్కొంటున్నారు.

ప్లాట్ యజమానుల ఐక్యత -- మెసారా గ్రూప్‌తో ముందడుగు

ఈ నేపథ్యంలో ఇటీవల ప్లాట్ యజమానులు సమావేశమై ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నారు. ఇకపై విడివిడిగా కాకుండా సమిష్టిగా ముందుకు సాగాలని నిర్ణయించారు. తమ హక్కుల కోసం ఒకే వేదికపై పోరాటం కొనసాగించాలని వారు సంకల్పించారు.

ఈ పోరాటంలో మెసారా ఇన్‌ఫ్రా గ్రూప్‌తో కలిసి పనిచేయాలని వారు నిర్ణయించారు. మెసారా ఇన్‌ఫ్రా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మారెళ్ల పెంచల సుబ్బారెడ్డి నాయకత్వంపై ప్లాట్ యజమానులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చట్టబద్ధమైన మార్గాల్లో తమకు న్యాయం సాధించడంలో సహకరిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సమావేశంలో పలువురు ప్లాట్ యజమానులు మాట్లాడుతూ, తమ ప్లాట్లు చట్టబద్ధంగా కొనుగోలు చేసినవేనని, వాటిపై తమకు సంపూర్ణ హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

న్యాయ హక్కుల సాధనపై ఆశలు

మొత్తం మీద కొల్లూరు భూముల వ్యవహారం మరో కీలక దశకు చేరుకున్నట్లు కనిపిస్తోంది. ప్లాట్ యజమానుల ఐక్యత, లోకాయుక్త తీర్పు ద్వారా వచ్చిన న్యాయబద్ధత, మెసారా గ్రూప్ మద్దతు వంటి అంశాలు కలిసివచ్చి సమస్య పరిష్కారానికి మార్గం సుగమం చేస్తాయని బాధితులు ఆశిస్తున్నారు.

సమిష్టి కృషితో తమ హక్కులను సాధించుకుంటామని ప్లాట్ యజమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొల్లూరు అంశం త్వరలోనే న్యాయబద్ధ పరిష్కారానికి దారి తీస్తుందనే ఆశలు ఇప్పుడు మళ్లీ బలపడుతున్నాయి.

## ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దు



అమరావతి 16 మార్చి(బిఎన్ఎస్): రాష్ట్రంలో ఎల్పిజీ గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు లేవని, పుకార్లను నమ్మి గ్యాస్ బుకింగ్ ల కోసం ఎజెన్సీల వద్ద క్యూలు కట్టవద్దని, రోజు వారి సగటు కంటే ఎక్కువ గ్యాస్ సిలిండర్లను గృహ వినియోగదారులకు అందిస్తున్నామని పౌర సరఫరాలు, ఆహారం మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్ష సమావేశం వివరాలను మంత్రి నాదెండ్ల మనోహర్ సచివాలయంలోని ప్రచార విభాగంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు గ్యాస్ డెలివరీ ఇబ్బందిలేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, వాస్తవంగా ప్రజలు సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ల బుకింగ్ కు ఆతృత పడటంతో సర్వర్లు సైతం మోరాయిస్తున్నాయని వివరించారు. కేంద్రం నిబంధల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత మరో గ్యాస్ సిలిండర్ బుకింగ్ కు అనుమతి ఉంటుందని ఈ విషయం ప్రతి ఒక్కరూ గమనించాలని మంత్రి మనోహర్ సూచించారు.

సాధారణ రోజుల్లో రోజుకు మన రాష్ట్రంలో 2.81 లక్షల గ్యాస్ సిలిండర్ల బుకింగ్ లు జరుగుతాయని, ఈ ఐదు రోజుల్లో గ్యాస్ కంపెనీలు యావరేజ్ గా 2.92 లక్షల గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేస్తున్నామన్నారు. ఒక్కో రోజు మూడు లక్షల సిలిండర్ల డెలివరీ కూడా చేశామని మంత్రి మనోహర్ వివరించారు. కాని ప్రజలు పుకార్లను నమ్మి ఒక్కసారిగా బుకింగ్ లు చేయడంతో సర్వర్లు సైతం జామ్ అయ్యే పరిస్థితి నెలకొంటుందని, కాని ప్రజలు నిబంధనలు తెలుసుకుని ఆ ప్రకారం బుకింగ్ లు చేయాలని సూచించారు. గ్యాస్ దొరకదన్న పుకార్లను నమ్మి ఎక్కువ మంది గ్యాస్ ఎజెన్సీల వద్ద క్యూలు కడుతున్నారని దీంతో సమస్య తీవ్రంగా ఉందన్న అపోహ ప్రజల్లో పెరుగుతుందన్నారు. కాని వాస్తవంగా యాప్, ఫోన్ కాల్, వాట్సప్, మిస్డ్ కాల్ లతో పాటు ఫోన్ ఫే తదితర యాప్ ల ద్వారా కూడా గ్యాస్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. అందుకనే సమాచార లోపం లేకుండా టెంప్లెట్స్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రం నిబంధనల ప్రకారం గ్యాస్ బుకింగ్ చేయగానే ఓటీపీ వస్తుందని, నూటికి నూరు శాతం ఓటిపీ ఉంటేనే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. దీంతో బ్లాక్ మార్కెట్ ను, అధిక ధరలు వసూళ్లు కు పాల్పడకుండ అరికట్టవచ్చన్నారు. అంతేకాకుండ గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ గా ఉపయోగించకుండ సమర్థవంతంగా అడ్డుకోవచ్చన్నారు.

రాష్ట్రంలో ఈ కేవైసీని వినియోగదారులు 95శాతం వరకు చేసుకున్నారని, కొంత మంది ఫోన్ నెంబర్లు మారిపోవడం తదితర కారణాలతో చేయలేకపోయారని దీంతో వారికి గ్యాస్ బుకింగ్ లు అవ్వడం లేదని మంత్రి మనోహర్ వివరించారు. యుద్ధం కారణంగా షిఫ్ మెంట్ లు ఆలస్యం అవుతున్న తరుణంలో కేంద్ర నిబంధనలు అందరూ అవగాహన చేసుకుని సంయమనం పాటించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల సరఫరాపై కమిషనర్, జేసీలతో టెలీకాన్ఫరెన్స్ ఏర్పాటు చేయడం కూడా జరిగిందన్నారు. పాఠశాలలు, హస్పటల్స్, దేవాలయాలు, సంక్షేమ వసతి గృహాలకు ఎక్కడా కూడా గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. అలాగే బ్లాక్ మార్కెట్ పై ఉక్కుపాదం మోపాలని, గృహావసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు ఉపయోగిస్తే వారిపై 6ఏ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటి వరకు అనగా ఈ ఐదు రోజుల్లోనే 616 కేసులు నమోదు చేయడంతో పాటు 2500 గ్యాస్ సిలిండర్లు సీజ్ చేయడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాకలను అప్రమత్తం చేసి జేసీల ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసి సమాచార లోపం లేకుండా చూస్తున్నామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు గ్యాస్ కంపెనీలు గృహవినియోగ సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేస్తామని భరోసా కూడా ఇచ్చారని, పైప్ న్యాచురల్ గ్యాస్ పై కూడా భరోసా లభించిందన్నారు. ఇక ఫెర్టిలైజర్స్, వ్యవసాయ సెక్టార్ విషయంలో 80 సబ్సిడీ సరఫరా లేకుండా చూస్తామని గ్యాస్ కంపెనీలు హామి ఇచ్చారన్నారు. ఈ రోజు నుండి గ్యాస్ కంపెనీల నుండి ప్రతి గంటకు ఒకసారి డెటా షేరింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ డేటా ఆధారంగా ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటూ క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ సజావుగా పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర కార్యాలయంలోని 1967 కు ఫిర్యాదులు గతంలో 300 కాల్స్ వచ్చేవి, కాని గత రెండు రోజుల నుండి వాటి సంఖ్య 180 దాకా తగ్గాయని అంటే పరిస్థితి అదుపులో ఉంది అని అర్థమవుతుందన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎల్పిజీ గ్యాస్ అందుబాటులోనే ఉందని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్, డైరక్టర్ నుపూర్ పాల్గొన్నారు.

## నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య

### నార్సింగి పోలీసుల చాకచక్యంతో నిందితుడు అరెస్ట్




శేరిలింగంపల్లి / నార్సింగి: (బిఎన్ఎస్ మీడియా) : నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని శేరిలింగంపల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ చె. శ్రీనివాస్, ఐపీఎస్ వెల్లడించారు.

నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో అనేక నిర్మాణ ప్రాజెక్టులు కొనసాగుతుండటంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు లేబర్ క్యాంప్‌లలో నివసిస్తున్నారు. వారు పనులకు వెళ్లే సమయంలో చిన్నపిల్లలను క్యాంప్‌లలోనే వదిలి వెళ్తుంటారు.

ఈ నేపథ్యంలో మార్చి 15న రాత్రి 10:30 గంటల సమయంలో ఓ వ్యక్తి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన నాలుగేళ్ల కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సేకరించిన ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు బాలికను మధ్యాహ్న సమయంలో తీసుకెళ్లిన వ్యక్తిని గుర్తించారు.

అనుమానితుడిగా గుర్తించిన బిస్వా ఓరావ్ అలియాస్ బిషు (25) ను అదుపులోకి తీసుకొని విచారించగా, అతడు నేరాన్ని ఒప్పుకున్నాడు.

వెస్ట్ బెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లాకు చెందిన నిందితుడు ప్రస్తుతం పుప్పాలగూడలోని వెస్టర్న్ కన్స్ట్రక్షన్స్ వద్ద మేసన్‌గా పనిచేస్తూ, బీఎస్ఆర్ లేబర్ కాలనీలో నివసిస్తున్నాడు.

పోలీసుల విచారణలో బాలికపై అత్యాచారం చేసిన అనంతరం గొంతు నులిమి హత్య చేసి, తర్వాత రాయితో కొట్టి సమీపంలోని పొదల్లో మృతదేహాన్ని పడేసినట్లు నిందితుడు వెల్లడించాడు. అతడు చూపించిన ప్రదేశంలో పోలీసులు బాలిక మృతదేహాన్ని గుర్తించారు. అరెస్ట్ చేసిన నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

## 22ఏ నిషేధిత జాబితా నుంచి 12 మంది కీ విముక్తి...

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా, నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కీలక కార్యక్రమం జరిగింది. గతంలో సాంకేతిక కారణాల వల్ల, రికార్డుల లభ్యత లేకపోవడం వల్ల నిషేధిత జాబితా (సెక్షన్ 22ఏ) లో చేర్చబడిన జరాయితి భూములపై జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించింది.?ఈ సర్వేలో సదరు భూములు ప్రభుత్వానివి కావని, అవి రైతుల సొంత “జరాయితి” భూములేనని నిర్ధారణ కావడంతో, వాటిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తదనుగుణంగా, నేడు 12 మంది లబ్ధిదారులకు ఆ భూములపై పూర్తి హక్కులు కల్పిస్తూ సంబంధిత పత్రాలను కలెక్టర్ స్వయంగా అందజేశారు.



BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్
17-03-2026

# ఆత్మకూరు అభివృద్ధి చేస్తాం. : మంత్రి ఆనం



ఆత్మకూరు,మార్చి 16(బిఎన్ఎస్): ఆత్మకూరు పట్టణ అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో క్రీడా ప్రాంగణం, నగరవనం, బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను అధికారులతో కలిసి పరిశీలించారు.ప్రస్తుతం ఉన్న క్రీడా ప్రాంగణం విస్తరణ కోసం మరో 10 ఎకరాల అదనపు స్థల సేకరణకు సంబంధించి మంత్రి స్థలాన్ని పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అలాగే నగరవనం అభివృద్ధి కోసం నేషనల్ హైవే నుండి అప్రోచ్ రహదారి ఏర్పాటు చేయడానికి అనువైన ప్రాంతాలను పరిశీలించారు.

అదేవిధంగా బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల శాశ్వత భవనాల నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని గుర్తించేందుకు అధికారులతో కలిసి పరిశీలించి, త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ: ఆత్మకూరు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు విద్య, క్రీడలు, పర్యావరణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

మోడల్ రహదారిగా ఆత్మకూరు బైపాస్ రోడ్డు :

ఇప్పటికే ఆత్మకూరు బైపాస్ రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మరో ఆరు నెలల్లో ఆత్మకూరుకు అద్భుతమైన రహదారిని అందిస్తామని మంత్రి తెలిపారు. రహదారిని బ్యూటీఫికేషన్, సెంట్రల్ లైటింగ్ వంటి ఆధునిక హంగులతో మోడల్ రహదారిగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

అనంతరం ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించి, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫస్ట్ ఎయిడ్ ఫర్ ఎవరీ హోమ్"

## పుస్తకం ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు



అమరావతి ,మార్చి16(బిఎన్ఎస్) : విజయవాడలోని ఏ- కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన రాష్ట్రస్థాయి దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమంలో "గోలు అండ్ పప్పా - ఫస్ట్ ఎయిడ్ ఫర్ ఎవరీ హోమ్" అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు.ఈ పుస్తకంలో ప్రథమ చికిత్స ( ఫస్ట్ ఎయిడ్ )గురించి అందరికీ అర్థమయ్యేలా కథల రూపంలో చక్కగా వివరించినందుకు పుస్తక రచయిత డాక్టర్.జావేద్ అష్రఫ్ ను చంద్రబాబు అభినందించారు.న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఇంటా బయట ప్రమాదాలు లేదా ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిపుణుడైన డాక్టర్ దగ్గరకు లేదా ఆసుపత్రికి తీసుకెళ్లేదాక పేషంటును రక్షించడానికి అవసరమైన ప్రథమ చికిత్సను కథల రూపంలో పిల్లలకు వివరించడం చాలా బాగుందన్నారు.ఈ పుస్తకం ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరి దగ్గర ఉండవలసిన పుస్తకమని అన్నారు. ఈ పుస్తకం చదివిన వారిలో ఆత్మ విశ్వాసం పెరిగి ఇంటి వారిని బయటివారిని రక్షించడానికి ముందుకువస్తారన్నారు. కార్యక్రమం అనంతరం డాక్టర్ జావేద్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో కుటుంబాలు చిన్నవైపోయాయని, ఏదైనా జరిగితే ఆదుకునే వాళ్లు కరువైనారని, అలాగే సరైన అవగాహనలేనందువల్ల దారిలో ఎవరైనా పడిపోతే ఏమిచేయాలో తెలియక చాలామంది ప్రేక్షకులుగా ఉండిపోతున్నారని అన్నారు.అందువల్ల ప్రజల్లో ప్రథమ చికిత్స పట్ల అవగాహన పెంపొదించి వారు అవసరమైనపుడు తమ వాళ్లకు, ఇతరులకు సహాయపడేలా చూడాలనే ఉద్దేశ్యంతోనే తాను అందరికీ అర్థమయ్యేలా కథలరూపంలో ప్రథమ చికిత్సపై ఈ పుస్తకాన్ని రచించడం జరిగిందని పేర్కొన్నారు.తన పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రోత్సహించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు,మంత్రి ఫరూక్ లకు డాక్టర్ జావేద్ కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ ని కలసిన బీసీ సంఘం యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి- మతకాల సాయి



నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బి.సి.సంఘం నాయకులు కొల్లు మధుబాబు యాదవ్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల గారిని కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మతకాల సాయి యాదవ్.

# శివాలయ సచివాలయంను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

## ఆకస్మిక తనిఖీ.. గైర్హాజరైన సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం



ఉమ్మడి నెల్లూరు జిల్లా, వెంకటగిరి(బి.యన్.యస్):- ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాల్సిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధులకు డుమ్మా కొట్టడంపై వెంకటగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కురుగొండ్ల రామకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన స్థానిక శివాలయము వీధి నందు ఉన్న సచివాలయం కార్యాలయంను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయంలో కేవలం ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉండటం, మిగతా వారంతా ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే గారు మండిపడ్డారు.వెంటనే అటెండెన్స్ (హాజరు) రిజిస్టర్లను స్వయంగా పరిశీలించారు. విధులకు హాజరుకాని సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వారికి మెమోలు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ మరియు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండి తీరాలి. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు. పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని ఎమ్మెల్యే హెచ్చరించారు. పారిశుధ్య నిర్వహణ, ఇతర ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై కూడా ఆయన అసహనం వ్యక్తం చేశారు.

# ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలపై కడప కలెక్టర్ అధికారులతో సమీక్ష

## ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి వారి బ్రహ్మోత్సవాల నిర్వహణ ఏప్రిల్ 01 న రాముల వారి కల్యాణోత్సవం




కడపజిల్లా (బిఎన్ఎస్) మార్చి16:- ఒంటి మిట్ట శ్రీ కోదండ రామ స్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల నిర్వహణ పై సోమవారం ఉదయం ఒంటిమిట్ట టిటిడి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,టిటిడి జెఈఓ వి.వీరబ్రహ్మం,సివిఎస్ఓ మురళీ కృష్ణ,ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్,రాజం పేట సబ్ కలెక్టర్ భావన,రాజం పేట ఏఎస్పి మనోజ్ రామ నాథ్ హెగ్డే,డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు లతో కలసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహణ చేపట్టారు.ఇందులో భాగంగా

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి వారి ఆలయంలో శ్రీ రామ నవమి బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగంగా మార్చి 26 న అంకురార్పణ,మార్చి 27న శ్రీరామనవమి పర్వదిన ధ్వజారోహణముతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహణకు టిటిడి అధికారులు కోదండరామ స్వామి వారిఆలయం,కళ్యాణ వేదికల వద్ద జరుగుతున్న అభివృద్ధిపనులను,సంబంధి త అంశాలను జిల్లా కలెక్టర్ వారికి టిటిడి జేఈఓ వారు వివరించారు.

రాములవారి బ్రహ్మోత్సవాల నిర్వహణ,ఏప్రిల్ 01 న రాముల వారి కల్యాణోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు రాష్ట్ర ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా సమర్పణ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు,వేసవిని దృష్టిలో పెట్టుకొని త్రాగునీరు పంపిణీ,భక్తులరద్దీ నిర్వహణ, గ్యాలరీలు,క్యూలైన్ ల నిర్వహణకు ప్రత్యేక అధికారుల నిర్వహణ,మెడికల్ సదుపాయాలు,భక్తులకు

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ,పక్కాగా పారిశుధ్య నిర్వహణ,మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు,అంబులెన్స్ వాహనం ఏర్పాట్లు,పార్కింగ్ ప్రదేశాల నిర్ణయం, బ్యారీకేడింగ్,ఆలయం చుట్టూ వాహన సేవల నిమిత్తం రోడ్డు మరమ్మతులు,హెలిప్యాడ్,

కడప టౌన్ నుండి,రైల్వే స్టేషన్ నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు,పాసులు పంపిణీ,అన్న ప్రసాదం పంపిణీ,మీడియా కవరేజ్ నిమిత్తం లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాటు,టిటిడి అన్నదానం గ్యాలరీలలో పంపిణీ,పానకం పంపిణీ,నిరంతర విద్యుత్తుసరఫరా, పుష్పాలంకరణ,తలంబ్రాలు,సాంస్కృతికకార్యక్రమాలు, తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమం లో సంబంధిత టిటిడి అధికారులు,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు....

# ప్రత్యేక ప్రజావాణి



నల్గొండ (బీఎన్ఎస్): దివ్యాంగులు, వృద్ధుల కోసం ఈ నెల 28న ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు... ప్రతి నెల చివరి శనివారం లో ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇందులో అన్ని శకహలబ్ అధికారులు ఉండి వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు.. జిల్లా కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి ద్వారా వస్తున్న ఫిర్యాదులను మండల స్థాయిలోనే పరిష్కరించాలని అన్నారు.

# గ్యాంగ్ రేప్ మర్డర్ కేసులో నలుగురు ముద్దాయిలకు జీవిత ఖైదు.

## ఎస్పీ డి. నరసింహ కిషోర్

2024 సంవత్సరం తూర్పుగోదావరి జిల్లా కడియం పోలీస్ స్టేషన్ హాలో నమోదైన బుర్రిలంక గ్రామం లో సంచలనం రేపిన రౌతు కస్తూరి హత్య గ్యాంగ్ రేప్ & మర్డర్ కేసులో ముద్దయిలకు జీవిత ఖైదు మరియు జరిమాన విధిస్తూ రాజమండ్రి 8వ ADJ కోర్ట్ జడ్జ్ సంచలమైన తీర్పు ఇచ్చారు.

విచారణకు కావలసిన సాక్ష్యాలను అందజేస్తే శిక్షలు కచ్చితంగా పడతాయని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ శ్రీ డి. నరసింహ కిషోర్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన వివాహిత దివి 15.10.2024 వ తేదీన నర్సరీ పని నిమిత్తం బుర్రిలంక వంతెన దగ్గరలో గల పాఠం శెట్టి రాముడు గారి నర్సరీ లోకి పనికి వెళ్ళినట్లు సాయంత్రం 6:00 గంటలు అయిన ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త ఫోన్ చేసిన ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చినట్లు చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో, కడియం పోలీసులు 314/24 యూ/హెచ్ విమెన్ మిస్సింగ్ గా కేసు నమోదు చేశారు.

17 వ తేదీన వివాహిత మృతదేహం చొప్పెల్ల లాకులు వద్ద ఉన్నదని గుర్తించి, మృతదేహాన్ని రాజమండ్రి గవర్నమెంట్ హాస్పటల్ తరలించి కేసును విమెన్ మిస్సింగ్ కేసులు,194 దీఃరూ గా కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం జరిపించి దర్యాప్తు చేపట్టారు. టెక్నికల్ ఎవిడెన్స్ మరియు పోలీసులు రాబడిన సమాచారం ప్రకారం,అదే ప్రాంతానికి చెందిన దేవర యేసు,వెలుబుడి ప్రవీణ్,లోకిన జయ ప్రసాద్,దాసరి సురేష్ లను విచారించ,15 వ తేదీన సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో నర్సరీ మొక్కల మధ్యలో మద్యం సేవిస్తూ నర్సరీ పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న మహిళను అత్యాచారం చేసి హత్య చేసి కాళ్లు చేతులు కట్టి కాలువలోకి విసిరేసినట్లుగా అంగీకరించారు.

పోలీసులు మీరు నలుగురిని రిమాండ్ పంపి సాక్షాదారాలతో కేసు నిరూపణ చేశారు. ఇందులోని వాస్తవాలు సాక్ష్యాలు సరిపోవటంతో ఈ నలుగురే అత్యాచారం చేసి హత్య చేశారని నిరూపణ అయిందని ధ్రువీకరిస్తూ ADJ కోర్ట్ జడ్జ్ నలుగురికి యావత్ జీవ శిక్ష అమలు చేయాలని తీర్పు ఇచ్చారు.ఈ కేసులో సాక్ష్యాలను సేకరించి కోర్టులో నిరూపించిన, సౌత్ జోన్ డి.ఎస్.పి గారు అయిన శ్రీమతి.భవ్య కిషోర్, ఏ పీపీ శ్రీ. కే రాధ కృష్ణ రాజు,ఎస్సై బి. నాగ దుర్గ ప్రసాద్, కోర్ట్ కానిస్టేబుల్ శ్రీ. కే శ్రీనివాస్, సాక్ష్యులను కోర్ట్ కు హాజరు పరిచిన, శ్రీ. ఏ వెంకటేశ్వరరావు, దర్యాప్తు కు సహకరించిన హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుల్ వాసు మరియు భీమారావు లను శ్రీ డి. నరసింహ కిషోర్ అభినందించి, రివార్డులు ప్రకటించారు.

# జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కారానికి "కడప"కు ఒకటవ ర్యాంక్



కడపజిల్లా..(బిఎన్ఎస్) మార్చి16:-"జాతీయ లోక్ అదాలత్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయిలో వైయస్సార్ కడపజిల్లాకు1వ (ఒక్కటి)ర్యాంక్ వచ్చిందని గౌరవ డాక్టర్ సి.యామిని, చైర్మన్,మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, తెలియజేస్తూ గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు గౌరవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా గౌరవ జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడపవారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 14-03-2026 వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడిందని, కడపజిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని,అందులో జాతీయ లోక్ అదాలత్ లో జిల్లావ్యాప్తంగా 103343 క్రిమినల్ కేసులు,248 సివిల్ కేసులు మరియు 53 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారము కాబడినవి, తెలుపుతూ, ఈకేసుల మొత్తం:-24,01,72,158/- (24 కోట్ల 01 లక్షల 72 వేల 158 రూపాయలు) కక్షిదారులకు చెల్లించబడినది.అని ఈ మేరకు కడపజిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల నందు కేసులు క్రింది విధంగా పరిష్కారం కాబడినవి అని తెలియజేశారు.

కడప నందు11720 కేసులు, పొద్దుటూరు మరియు మైదుకూరు నందు15303 కేసులు,రాజంపేట నందు 7116 కేసులు,రాయచోటి నందు 9635 కేసులు, బద్వేల్ నందు 8105 కేసులు, జమ్మలమడుగు నందు 9700 కేసులు, సిద్ధవటం నందు 5070 కేసులు, రైల్వేకోడూరు నందు 6117 కేసులు, పులివెందులనందు 8394 కేసులు, నందలూరు నందు 6055 కేసులు,లక్కిరెడ్డిపల్లి నందు10093 కేసులు, కమలాపురం నందు 6283 కేసులు జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కరించబడినవి.

జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులకు, పత్రిక విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో కడప వారికి,రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కు లకు, అగ్రికల్చరల్ అధికారులకు మరియు మిగతా శాఖల అధికారులు అందరికీ గౌరవ డాక్టర్ సి. యామిని, చైర్మన్, మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికాం సంస్థ, కడప వారు మరియు గౌరవ శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడపవారు కేసుల పరిష్కారానికి సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కొత్తపేటలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కు ఘన సత్కారం



కొత్తపేట, (బిఎన్ఎస్ )మార్చి 16: తెలుగు భాషకు ఎంతో ప్రాచుర్యం కల్పించిన అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ కు కొత్తపేటలో ఘన సత్కారం లభించింది.. రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో గల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పొట్టి శ్రీరాముల విగ్రహాన్ని ఆవిష్కరించారు.. విగ్రహాశిల్పి రాజకుమార్ ఉడయార్ కోరిక మేరకు శిల్పశాలను సందర్శించేందుకు కొత్తపేట విచ్చేశారు.. టిడిపి శ్రేణులు శిల్పశాలకు వచ్చి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ను ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో కొత్తపేట ఏఎంసి వైస్ చైర్మన్ కంఠం శెట్టి శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు ఉప సర్పంచ్ విల్ల మారుతి ప్రసాద్ రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దె ఆదినారాయణ టిడిపి నాయకులు చోడపనీడి భాస్కరరావు ముద్రగడ సుబ్బారావు శీలం సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు

# జూన్ నెల దర్శన కోటా విడుదల వివరాలు



2026 జూన్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి.తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల( సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన మే నెల కోటాను మార్చి 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం మార్చి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.ఈ టికెట్లు పొందిన వారు మార్చి 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి.

**21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల**

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, జ్యేష్ఠాభిషేకం టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది.

**వర్చువల్ సేవల కోటా విడుదల**

వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**23న అంగ ప్రదక్షిణ టోకెన్లు విడుదల**

అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

**శ్రీవాణి దర్శన కోటా విడుదల**

శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.

**వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా...**

వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల**


ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల...

తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

# తెగచర్లలో గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం



నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్):- నెల్లూరు జిల్లా రాపూరు మండలంలో గాలి కుంటు వ్యాధి నివారణ కార్యక్రమం 16-03-2026నుండి14-04-2026వరకు 30రోజుల పాటు షెడ్యూల్ వారీగా ప్రతి గ్రామంలో నిర్వహించనున్నారు.
ముందుగా తెగచర్ల మరియు కంభాలపల్లి రాపూరు పశుసంవర్ధక శాఖ ఏ.డి.బి.వి.సురేష్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించి టీకాలు ప్రారంభించారు.అనంతరం ఏ.డి.మరియు పశు సంవర్ధక శాఖ డాక్టర్లు మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధి సోకిన పశువులు నోటిలో మరియు గిట్లలో పుండ్లు ఏర్పడి తీవ్రమైన జ్వరం వస్తుంది, అదేవిధంగా పుండ్లు వలన ఆహారం తీసుకోకపోవడం, తద్వారా పాల దిగుబడి తగ్గడం వంటివి జరుగుతాయి.కాబట్టి రైతుమిత్రులు అందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో

# పాల్గొన్న హోం మంత్రి అనిత

- □అమరజీవి పొట్టి శ్రీరాములు మహానుభావుడు, త్యాగశీలి
- □పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించింది
- □ఎన్‌డీఏ ప్రభుత్వంలో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయి
- □ఈనెల 23న నక్కపల్లి మండలంలో స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరుగుతుంది...

**- హోం మంత్రి అనిత**



నక్కపల్లి ,మార్చి 16 (బిఎన్ఎస్ ) :నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు మహానుభావుడు, త్యాగశీలి అని కొనియాడారు. ఆయన చేసిన త్యాగం, స్ఫూర్తి యావత్ తెలుగు జాతికి ఆదర్శమని పేర్కొన్నారు. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం సాధించాలనే లక్ష్యంతో 58 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్ష చేపట్టి చివరకు తుది శ్వాస విడిచారని గుర్తు చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని తెలిపారు. తెలుగు ప్రజల కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని మంత్రి అన్నారు. ఆయన త్యాగానికి ప్రతీకగా ప్రజా రాజధాని అమరావతిలో 58 అడుగుల అమరజీవి విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తుంచుకోవాలని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రభుత్వం పాలన సాగిస్తోందని హోం మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో పెద్దగా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. అయితే ప్రస్తుతం ఎన్‌డీఏ ప్రభుత్వంలో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు.

మహిళలు ధైర్యంగా, ఆరోగ్యంగా ఉండాలని సూచించిన మంత్రి, మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈనెల 23వ తేదీన నక్కపల్లి మండలంలో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరగనుందని తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం...

## 125వ జయంతి సంధర్బంగా ఘన నివాళులు...



మండపేట.. (బి ఎన్ ఎస్ ) మార్చి16...అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గారు అన్నారు. ఆయన పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా జిల్లా ఆర్యవైశ్యా సంఘం అధ్యక్షులు వాకచర్ల గుప్తా, మండపేట మండల ఆర్యవైశ్యా సంఘం అధ్యక్షులు కాళ్ళకూరి శ్రీనివాస్, 17వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి కాళ్ళకూరి స్వరాజ్య భవాని, కూటమి నాయకులతో కలసి సోమవారం స్థానిక పెద్దకాలువ వంతెన వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణి కార్యక్రమంలో పాల్గొని 200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టిశ్రీరాములు తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తి దాయకమన్నారు. నిస్వార్ధ ఆశయాలు కలిగిన గాంధేయవాది, దేశభక్తుడు, కుల వివక్షను రూపుమాపేందుకు కృషి చేసిన సమతావాది పొట్టిశ్రీరాములు అని పేర్కొన్నారు. ఈ సంధర్బంగా తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవల్ని గుర్తుచేసుకున్నారు.

# ఈ నెల 29న జరిగె జిల్లాస్థాయి తైక్వాండో బెల్ట్ టెస్టింగ్ పోటీల పోస్టర్ ను ఆవిష్కరించిన డాక్టర్ చల్లా.



ఆలమూరు: (బిఎన్ఎస్ )మార్చి.16.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం దేవతికుల సంక్షేమ సంఘం భవనంలో నిర్వహించిన బెల్ట్ టెస్టింగ్ పోస్టర్లను ఆవిష్కరించిన మార్షల్ ఆర్ట్స్ గౌరవ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గ్రాండ్ మాస్టర్ టి అబ్బులు, సీనియర్ మాస్టర్స్ లంకె వెంకటరెడ్డి, నార్గని సెంథిల్ కుమార్,మాస్టర్స్ కర్రి సత్తిబాబు, నిచ్చినకోళ్ళ సుబ్రహ్మణ్యం, ఆకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.అలాగే ఈ కార్యక్రమంలో ఆలమూరు శ్రీకృష్ణ దేవరాయ కాపు సంఘం సెక్రటరీ ఎలుగుబంటి సాయిబాబా, ఆంధ్రప్రదేశ్ ఐక్య కాపునాడు ఆలమూరు మండలం ప్రెసిడెంట్ గొర్రిపూడి పెదకాపు,పంచాయితీ బోర్డు మెంబర్లు ఎలుగుబంటి బూరయ్య,ఎరుకొండ గణేష్,శ్రీ భట్టి విక్రమార్కేశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ చైర్మెన్ శ్రీపతి వీర్రాజు,ప్రముఖ వ్యాపారవేత్త వెత్సా శ్రీనివాసు,రావూరి శివ,గుబ్బల ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

# బుద్వేల్ చౌరస్తాలో సీపీఐ భారీ నిరసన

## : గ్యాస్ ధరల పెంపుపై మండిపడ్డ నేతలు



బిఎన్ఎస్, రాజేంద్రనగర్ : పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు రాజేంద్రనగర్ మండల కేంద్రంలో మండల పార్టీ కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో బుద్వేల్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ ఇస్లామిక్ దేశమైన ఇరాన్ పై అమెరికా యుద్ధం చేస్తుంది ఆ కారణంతో క్రూడ్ ఆయిల్ ధరలు కొరత ఉందని గ్యాస్ ధరలు పెంచడం మోదీ ప్రభుత్వానికి అంత మంచిది కాదు అని వారు మండిపడ్డారు ఇరాన్ భారత మిత్ర దేశమని భారత్ కుఎప్పుడు సహకరిస్తూ వస్తున్న ఇరాన్ ను వదిలేసి అగ్రరాజ్యమైన అమెరికా సంకలో కూర్చోవడం భారత ప్రధాని మోడీకి సరైనది కాదు అని వారు ఇతువు పలికారు. అమెరికా దేశ అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ మాటలు వింటే భారతదేశానికి అపారమైన నష్టం వాటిలుతుంది అదిభవిష్యత్తులో భారతదేశానికి ముప్పు తలపెట్టి అవకాశం ఉంది అని దాన్ని మోది ప్రభుత్వం పసిగట్టి మసులుకుంటే మంచిదని వారు తెలిపారు గోదావరి ఒడ్డున గ్యాస్ నిక్షేపాలను ఆదానికి కట్టబెట్టి పైప్ లైన్ల ద్వారా గుజరాత్ రాష్ట్రానికి తరలించకపోతున్నారు అని వారు ఆరోపించారు ఇప్పటికే పెరిగే ధరలని నియంత్రించలేని మోడీ గ్యాస్ ధరలు పెంచి ములిగేనకపై తాటికాయ పడ్డట్టు గా ప్రజలపై భారాలు మోపడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు వెంటనే పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని అమెరికా, ఇజ్రాయిల్ ఉచ్చులో చిక్కుకోవద్దని భారతదేశ స్వరోభవత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం పై ఉందని ఆ దిశగా పయనించాలని లేని యెడల యావత్ భారతదేశం ఉన్న 140 కోట్ల మంది జనాభా ముందు బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం దోషిగా నిలబడాల్సి వస్తుందని వారు తెలియజేశారు ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు అధికారం ఉంది మేము ఏమైనా చేస్తామని మోడీ ప్రభుత్వం ఆలోచన చేస్తే బిజెపి ఆటోవో అని దేశ ప్రజలు మొత్తం బిజెపి ప్రభుత్వంపై తిరగబడక తప్పదని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్ మండల సహాయ కార్యదర్శి జె విజయ ఆనంద్ గౌడ్ మండల ఏఐటీయూసీ కార్యదర్శి సయ్యద్ కాజా అధ్యక్షులు ఎండి సలీం మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం మండల కౌన్సిల్ సభ్యులు పాండు సదానంద గౌడ్ మౌనిక కె వాణి పుష్ప శాలిని శాంతమ్మ ఎండి సాబీర్ ఇంద్ర మణెమ్మ జంగయ్య తదితరులు పాల్గొన్నారు

# నారా భువనేశ్వరి చేతుల మీదగా ఉత్తమ అవార్డు అందుకున్న విక్కుర్తి తులసీ



ఎన్టీఆర్ ట్రస్ట్ అధినేత, హెరిటేజ్ సంస్థ చైర్మన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చేతుల మీదగా రాఘవ ప్రాజెక్ట్స్ తరపున విక్కుర్తి తులసీ ఉత్తమ అవార్డు అందుకున్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రారంభించి 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ కు సహకరిస్తూ, వివిధ రంగాలలో ముందంజలో నిలుస్తున్న ప్రముఖులకు ఆదివారం ఉత్తమ అవార్డులను అందజేశారు.

ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు, విక్కుర్తి వీర రాఘవయ్య ఫౌండేషన్ చైర్మన్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు నిర్వహిస్తున్న రాఘవ ప్రాజెక్ట్స్ సంస్థ అవార్డుకు ఎంపిక అయింది. రాఘవ ప్రాజెక్ట్స్ నిర్వాహకులు వీ .వీ శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో వారి కుమార్తె తులసీ ఈ అవార్డును నారా భువనేశ్వరి చేతుల మీదగా అందుకున్నారు. జ్ఞప్తిక, సర్టిఫికెట్ లను అందజేసి తులసీని భువనేశ్వరి ఘనంగా సత్కరించారు. కార్యక్రమం ప్రారంభానికి భువనేశ్వరితో విక్కుర్తి తులసీ సరదాగా కొద్దిసేపు ముచ్చటించారు.

ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వహించే ఉత్తమ అవార్డుకు అవనిగడ్డ కు చెందిన విక్కుర్తి శ్రీనివాస్ నేతృత్వంలోని రాఘవ ప్రాజెక్ట్ సంస్థ ఎంపిక కావడం పట్ల అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రేసులో విక్కుర్తి శ్రీనివాస్ ముందంజలో ఉండడంతో, ఈ అవార్డుకు ప్రాధాన్యత సంతరించుకుంది.

కార్యక్రమంలో హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ యం సాంబశివరావు, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో, విశ్రాంత ఐఏఎస్ అధికారి సీకే రాజేంద్ర కుమార్, అడుసుపల్లి గోపి, బి.ఎస్.ఆర్ కన్స్ట్రక్షన్ అధినేత శ్రీనివాసరావు లతో పాటు పలువురు ప్రముఖులు, వివిధ కంపెనీల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## 'ఉస్తాద్ భగత్ సింగ్' టికెట్ ధరలు పెంపు లేదు.!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ -- దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం విడుదలకు ముందే టికెట్ ధరలపై స్పష్టత వచ్చింది. ఈ సినిమా కోసం తెలంగాణలో టికెట్ ధరలను పెంచబోమని నిర్మాత సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రకటించింది.

భారీ బడ్జెట్ సినిమాలకు సాధారణంగా మొదటి వారం టికెట్ ధరలు పెంచే ఆనవాయితీ ఉన్నప్పటికీ, ఈ చిత్రాన్ని మాత్రం సాధారణ ధరలకే ప్రదర్శించాలని నిర్ణయించారు. తెలంగాణలో మార్చి 19న ఉదయం 7:30 గంటలకు తొలి షో ప్రారంభం కానుంది.

న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండటం, అలాగే సామాన్య ప్రేక్షకుడికి సినిమా అందుబాటులో ఉండేలా చేయడమే ఈ నిర్ణయానికి కారణమని సమాచారం. కాగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం టికెట్ ధరల పెంపు, బెనిఫిట్ షోలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఉగాది కానుకగా విడుదలవుతున్న ఈ చిత్రం, గబ్బర్ సింగ్ కాంబినేషన్ మళ్లీ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.





## ఫస్ట్ డే షూట్‌లో పవన్ కల్యాణ్ నన్ను అడిగిన ప్రశ్న అదే

రాశి ఖన్నా నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం మార్చి 19న విడుదల కానున్న నేపథ్యంలో ఆమె ఆసక్తికర విషయాలు వెల్లడించారు. పవన్ కళ్యాణ్ సినిమా అని తెలిసి కథ వినకముందే ఒప్పుకున్నానని తెలిపారు.షూటింగ్ తొలి రోజున పవన్ కళ్యాణ్ "మీరు నటి అవ్వాలనుకున్నారా?" అని అడిగారని, తాను అసలు ఐఏఎస్ అవ్వాలనుకున్నానని చెప్పినట్లు తెలిపారు. పవన్ చాలా సాదాసీదాగా ఉండే వ్యక్తి, ఎప్పుడూ పుస్తకాలు చదువుతుంటారని ఆమె అన్నారు.హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు.

## 'నేనే గెలిచా.. విజ్జూ నా టీమే' : రష్మిక ఆసక్తికర పోస్టు

నటి రష్మిక మందన్న తన హల్దీ వేడుక జ్ఞాపకాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. భర్త విజయ్ దేవరకొండ తో జరిగిన వేడుక హోలీ లా రంగులతో నిండిపోయిందని, ఫిబ్రవరి 25న జరిగిన ఆటలన్నింటిలో తానే గెలిచానని సరదాగా తెలిపారు. విజ్జూ కూడా తన టీమ్‌లోనే ఉన్నాడని పేర్కొన్నారు.

విజయ్ దేవరకొండ మాత్రం స్వదేశంలో అవుట్‌డోర్ వెడ్డింగ్ కావాలని భావించి ఉదయపూర్ లో వేడుక నిర్వహించామని చెప్పారు. ఫిబ్రవరి 26న వివాహం జరిగిన ఈ జంట ప్రస్తుతం రణబలి చిత్రంలో కలిసి నటిస్తున్నారు.




## రియలిస్టిక్ సినిమాలకు బ్రాండ్ డైరెక్టర్ వెట్రిమారన్



రియలిస్టిక్ సినిమాలకు పేరుగాంచిన దర్శకుడు వెట్రిమారన్ కొత్త చిత్రం అరసన్ షూటింగ్ మార్చి 16 నుంచి ప్రారంభం కానుంది. ఈ సినిమాలో సిలంబరసం టిఆర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. కథ, ఇతర నటీనటుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.ఇక వెట్రిమారన్ తెరకెక్కించిన వడ చెన్నై చిత్రానికి సీక్వెల్ కూడా త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. దర్శకుడు వెట్రిమారన్-- నటుడు ధనుష్ కాంబినేషన్‌లో వచ్చిన పొల్లాదవన్ , ఆడుకలం , అసురన్ చిత్రాలు ఘన విజయం సాధించాయి.దీంతో వడ చెన్నై 2పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## సల్మాన్ 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' పేరు మార్పు




బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ నటిస్తున్న బ్యాటిల్ అఫ్ గల్వాన్ చిత్రానికి పేరు మారింది. ఈ సినిమాను ఇకపై మాతృభూమి పేరుతో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కొత్త పోస్టర్‌ను సల్మాన్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు.

అపూర్వ లఖియా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం 2020లో జరిగిన గాల్వాన్ వ్యాలీ క్లాష్ ఆధారంగా తెరకెక్కుతోంది. ఇందులో తెలంగాణకు చెందిన వీర జవాన్ బిక్కుమళ్ల సంతోష్ బాబు పాత్రలో సల్మాన్ నటిస్తున్నట్లు సమాచారం.ఈ చిత్రంలో చిత్రాంగద సింగ్ కథానాయికగా నటిస్తున్నారు. పేరు మార్పుతో సినిమా విడుదల ఆగస్టుకు వాయిదా పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.